క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన రమేష్‌రెడ్డి

చింతలపూడి : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి ఎస్.రమేష్ రెడ్డి తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అవడంతో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, చింతలపూడిని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, ప్రగడవరం ప్రాంతంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ మంజూరు చేయాలని, కొత్త ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఈ విషయాలపై సానుకూలంగా స్పందించారని రమేష్‌రెడ్డి చెప్పారు.

సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కుకునూరు : తమ సమస్యలు పరిష్కరించాలని మండలానికి విచ్చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు గ్రామస్తులు విన్నవించుకున్నారు. కుకునూరు ఎ–బ్లాక్‌కు చెందిన నకిరికంటి సుబ్బారావు స్థానికుడైనప్పటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పేరు తొలగించారని ఎంపీకి వివరించగా ఆయన వెంటనే ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యకు ఫోన్ చేసి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే అశ్వారావుపేట, బూర్గంపాడు ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండడంతో ఇబ్బందులు పలువురు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన ఆర్‌అండ్‌బీ డీఈకి ఫోన్ చేసి రహదారి మరమ్మతులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కుచ్చర్లపాటి నరసింహరాజు, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం పాల్గొన్నారు

ఎమ్మెల్యే బాలరాజుకు నూజివీడు ఎమ్మెల్యే పరామర్శ



ఎమ్మెల్యే బాలరాజును పరామర్శిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

బుట్టాయగూడెం : గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మళ్లీ ప్రజలతో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా పోలవరం డీఎస్పీ లతాకుమారి, ఎస్సైలు వెంకటేశ్వరరావు, జయబాబు కూడా ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించారు.

సీతారామనగరంలో సర్వే

కుకునూరు : పోలవరం ముంపునకు గురవుతున్న భూముల విషయంలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన భూసేకరణలో తమ భూములు ముంపులో ఉన్నా, ముంపులేవని పేర్కొంటూ పరిహారం అందించలేదని సీతారామనగరానికి చెందిన కొందరు రైతులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఇరిగేషన్ అధికారులు ఆ భూముల్లో సర్వే నిర్వహించారు .ఈ సందర్భంగా 308 సర్వే నెంబర్‌లో ఉన్నటువంటి దేవాలయ భూములను అధికారులు సర్వే చేశారు. అనంతరం ఇదే గ్రామంలోనే 330 నుంచి ఉన్న సర్వే నెంబర్లకు సంబంధించి సర్వే నిర్వహించేందుకు వెళ్లగా, కొందరు సర్వే బృందాన్ని అడ్డుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. కాగా 308 సర్వే నెంబర్ దేవాలయ భూముల్లో జరిగిన సర్వేను తహసిల్దార్ ప్రమద్వర పరిశీలించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోమటి గుంట బాలకృష్ణ ఇంటిలో అక్రమంగా బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో తహసీల్దార్ స్లీవజోజి ఆదేశాలతో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ తనిఖీలు చేపట్టారు. ఇంటిలో నిల్వ చేసిన 22 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ: 17,874 ఉంటుందన్నారు. బాలకృష్ణ రేషన్ కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.10కు కొనుగోలు చేసి నల్లజర్ల తదితర ప్రాంతాల్లో కోళ్ల ఫారాలకు కేజీ రూ.14కు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని డీటీ సుధాకర్ తెలిపారు. 6ఎ కేసు నమోదు చేశామన్నారు.

నేడు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ద్వారకాతిరుమల: ఐఎస్.రాఘవాపురం ఎంపీటీసీ స్థానానికి త్వరలో ఎన్నిక జరుగనుందని ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలో డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను సిద్ధం చేశామన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే మంగళవారం ఉదయం 11 గంటల నుంచి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరుగనున్న సమావేశంలో తెలపాలన్నారు.

స్త్రీ నిధి.. మహిళలకు పెన్నిధి

కామవరపుకోట : మహిళల అభివృద్ధే లక్ష్యంగా స్వయం సహాయ సంఘాల ద్వారా ప్రభుత్వం అనేక పథకాలు అందజేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి అండగా నిలుస్తోంది. గతంలో మహిళలు చిరు వ్యాపారం నిర్వహించుకోవాలంటే ప్రైవేటు బ్యాంకుల వారిని ఆశ్రయించేవారు. వీరు సూక్ష్మ రుణాల పేరిట అధిక వడ్డీలతో ప్రజలను అడ్డంగా దోచుకునేవారు. దీనితో కుటుంబాలుకు ఆర్థికంగా నష్టం వాటిల్లేది. వాటిని తప్పించడం కోసం మహిళల కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్త్రీ నిధి బ్యాంకును ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలకు వరంగా మారింది. పొదుపు సంఘాలలో ఉన్న మహిళలు పొదుపు చేస్తూనే మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ప్రభుత్వం కల్పించిన స్త్రీ నిధి ద్వారా మహిళలు రుణం పొంది కిరాణా, ఫ్యాన్సీ, టైలరింగ్, గొర్రెల పెంపకం, పాడి గేదెల పెంపకం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరు వ్యాపారానికి స్త్రీ నిధి ద్వారా ఒకొక్క పొదుపు సంఘంలోని సభ్యులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మంజూరు పొందవచ్చు. ఈ రుణంతో మహిళలు తమ ఆసక్తి ఉన్న రంగాలలో యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు. దీంతో మహిళలు స్వయం ఉపాధిని పొందడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. మండలంలో 1497 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒకొక్క సంఘానికి రూ.4 లక్షల చొప్పున 400 సంఘాలలోని మహిళకు స్త్రీ నిధి ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగింది. దీనితోపాటు మండలంలోని వైఎస్సార్ ఆసరా ద్వారా అర్హత సాధించిన 1293 మహిళా గ్రూపులకు రెండు విడతలగా రూ.31 కోట్లు మహిళల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం ద్వారా ఆసరా పథకం వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడింది.



కామవరపుకోట కొండగూడెంలో స్త్రీ నిధి గూర్చి తెలుసుకుంటున్న మహిళా మండలి సభ్యులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరుచుకోవాలి



స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అందజేస్తోంది. ఈ పథకాలను మహిళలు సద్వినియోగపరుచుకుని క్రమం తప్పకుండా పొదుపు పాటించి, పొందిన రుణాలు సకాలంలో చెల్లించే విధంగా కృషి చేయాలి

–గుర్రాల భానుమతి, ఏపీఎం, కామవరపుకోట మండలం

స్త్రీ నిధి రుణంతో ఉపాధి పొందుతున్నా



మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం అందించిన స్త్రీ నిధి పథకం ద్వారా రూ. 50 వేల రుణం తీసుకుని కిరాణా షాపు నిర్వహిస్తున్నాను దీనితో ఉపాధి పొందుతూ నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను, స్త్రీ నిధి పథకం నా ఉపాధికి ఎంతగానో ఉపయోగపడింది.

– బిరుదు గద్ద నాగలక్ష్మి, సాయి తేజ
మహిళా మండలి గ్రూపు, కామవరపుకోట

వ్యాపార అభివృద్ధికి తోడ్పడింది



స్త్రీనిధి పథకం మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పడింది. ఈ పథకం ద్వారా రూ.50 వేల రుణంతో జిరాక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నాను.

– ప్రొద్దుటూరి శ్యామల, కరుణ
మహిళా మండలి గ్రూపు, కళ్ళచెరువు

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అప్పలరాజుగూడెంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన దృశ్యం

టి.నరసాపురం : అప్పలరాజు గూడెంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామి పూజ, పుణ్యాహవచనం, రక్షా కంకణధారణ, జల, క్షీర, పుష్ప, వస్త్ర ధాన్యాదివాస కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఉదయం 11 గంటల నుంచి అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అసత్యాలను ప్రచారం చేయొద్దని హితవు

జంగారెడ్డిగూడెం : మంచిని మంచిగా, చెడును చెడుగా చెప్పాలేగాని, అసత్యాలను ప్రచారం చేస్తూ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేయొద్దని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా హితవు పలికారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అఖండ విజయం సాధించిందన్నారు. ఇన్వెస్టర్‌లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు ముందుకు వస్తున్నారన్నారు. ఇది చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక కట్టుకథలు అల్లుతున్నాయన్నారు. పెయిడ్ ఆర్టిస్టులు వచ్చారని కథనాలు వండి వార్చుతున్నారరన్నారు. వైఎస్సార్‌సీపీకి గాని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గాని ఇలాంటి కట్టు కథలు చెప్పడం అలవాటు లేదన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఇన్వెస్టర్లు 340 ఒప్పందాల ద్వారా 20 రంగాల్లో 13లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి అంగీకారం తెలిపారని, వీటి ద్వారా సుమారు 6లక్షలు ఉద్యోగాలు రానున్నాయని, ఇది యువతకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కాగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం చేసి పెట్టుబడులు సాధించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కార్యక్రమ విజయవంతానికి వెన్నుదన్నుగా నిలిచిన ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్‌రెడ్డికి ఎమ్మెల్యే ఎలీజా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి సంతోషాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్టీ పట్టణాధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక సమావేశం

బుట్టాయగూడెం : ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులైన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రలను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జంగారెడ్డిగూడెంలోని ఆళ్లపాటి గంగాభవాని మండపంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి ఆళ్ల నాని, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రతోపాటు చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా, తాను పాలొంటానన్నారు. అలాగే చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొంటారని తెలిపారు.

దుర్గమ్మతల్లి తిరుణాళ్లకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న దుర్గమ్మతల్లి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మహోత్సవాల్లో పాల్గొనాలని ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లూరి రత్నాజీరావు సోమవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం కూడా బాలరాజును కలిసిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యే బాలరాజుతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

లింగపాలెం : చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కె.రవీంద్ర అన్నారు. సోమవారం మండలంలోని అయ్యపరాజుగూడెం, కలరాయునగూడెం, రంగాపురం గ్రామాలలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను ఆయన పరిశీలించారు. పాఠశాల రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగాన్ని ఆయన పరిశీలించి వాళ్ల విద్యాప్రమాణాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులు యూనిఫాం, బూట్లు వేసుకుని పాఠశాలకు రావాలన్నారు. పదోతరగతి పరీక్షలపై విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట పాఠశాలల హెచ్‌ఎంలు ఉషారాణి, వెంకటరత్నం, సత్యన్నారాయణ, తిరుపతి ఉన్నారు.



విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి రవీంద్ర

వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలి

లింగపాలెం : ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువులు తయారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం అన్నారు. సోమవారం కొణిజర్లలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వానపాములను సర్పంచ్ జయశ్రీ, అధికారులు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఆశీర్వాదం మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వానపాములు విడుదల చేసిన 45 రోజులకు వర్మి కంపోస్టు ఎరువు తయారవుతుందన్నారు. ఈ ఎరువును కిలో రూ.10 చొప్పున రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. మండలంలో 20 పంచాయతీల్లో ఈషెడ్‌లు ఉన్నాయన్నారు. మరో రెండు పంచాయతీల్లో షెడ్‌లు నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటికి 10 షెడ్‌లలో వర్మికంపోస్టు ఎరువులు తయారుచేటం జరుగుతుందన్నారు. మిగిలిన పంచాయతీలలో కూడా త్వరలో ఈషెడ్‌లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్కపాం శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ జేవీ రత్నకుమార్, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వానపాములు విడుదల చేస్తున్న సర్పంచ్ జయశ్రీ, అధికారులు

కౌలు రైతు సదస్సు విజయవంతం చేయండి

జంగారెడ్డిగూడెం : విజయవాడలో ఈ నెల 28న జరిగే కౌలు రైతుల సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మండల రైతు సంఘ నాయకుడు చిలప రెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది రైతులు ఉన్నారని కేవలం ఐదున్నర లక్షల మందికి మాత్రమే కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇచ్చారని తెలిపారు. కౌలు రైతులకు భూయజమాని నుంచి అంగీకార పత్రం ఉంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందిస్తాం అని రాష్ట్ర ప్రభుత్వం అనడం భావ్యం కాదన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమాలయ్య మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో అనేక మంది రైతులకు కాలువల ద్వారా సాగు నీరు వచ్చేలా కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతు కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, పి.బాలకృష్ణ, గొలిమే బాలయేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

నేడు విర్డ్‌లో చారిటబుల్ ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

ద్వారకాతిరుమల : స్థానిక విర్డ్ ఆస్పత్రిలో మంగళవారం చారిటబుల్ ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ. సుధాకరరావు తెలిపారు. ఈ శిబిరంలో అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు కామినేని శ్రీనాథ్ రోగులకు సేవలు అందిస్తారన్నారు. భుజం, మోచెయ్యి (ఎముక, జాయింట్) సమస్యలు ఉన్నవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాల్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

లింగపాలెం : చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ సుంకర సాయి స్వరూప్, ఎస్సై దుర్గాప్రసాద్ సోమవారం లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామాల్లో సారా విక్రయిస్తున్న ఈడా లక్ష్మీనారాయణ వద్ద నుంచి 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరించిన నేరంపై కేసు

జంగారెడ్డిగూడెం : ఆస్తి గొడవల నేపథ్యంలో చంపుతానని బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. చిన్నవారిగూడెంకు చెందిన కర్రెడ్ల వీరభద్రరావుకి, అతని తండ్రి కర్రెడ్ల సీతారామయ్యకు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. తండ్రి రెండవ వివాహం చేసుకున్నాడని, రెండవ భార్య , పిల్లలకు ఆస్తిని పంచివేశాడని గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన సీతారామయ్య, మరో ఇద్దరు కలిసి వీరభద్రరావుపై దాడి చేసి చంపుతానని బెదిరించారు. వీరభద్రరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జంగారెడ్డిగూడెం రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలం వేగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది ఎస్‌వీబీఎల్ ఆచారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల పరిరక్షణకై ప్రత్యేక చట్టాలు రూపొందించబడ్డాయన్నారు. న్యాయవాది భువనేశ్వరీ మాట్లాడుతూ ప్రతి బాలిక బయటకు వెళ్లినప్పుడు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా అవమానించినా వెంటనే సమస్యను తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మణికుమార్, టి.రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు టి.అమృతరావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

చింతలపూడి : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లోక్ అదాలత్ సభ్యులు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్ కుమార్ ఆదేశాల మేరకు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు బాధ్యతగా చదువుకోవాలన్నారు. చదువుకునే వయసులో ప్రేమ, పెళ్లిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళ, బాలిక పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివాహ చట్టాలను గురించి, లైంగిక వేధింపుల చట్టం, పోక్సో, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, మనోవర్తి, గృహహింస చట్టాల గురించి వివరించారు. భర్త ద్వారా మోసపోయిన మహిళలకు మెయింటెనెన్స్ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొవ్వూరి కనకదుర్గ భవాని, ప్రిన్సిపాల్ సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది ఆచారి

గోసమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



గోసమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీవారి దేవస్థానం ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: నిరాదరణకు గురవుతున్న ఒంగోలు జాతిని అభివృద్ధి చేసేందుకు, రైతులను ప్రోత్సహించేందుకు గోసమ్మేళనాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 17 నుంచి 19 వరకు జరుగనున్న గోసమ్మేళనం వాల్‌పోస్టర్‌ను సోమవారం ఈఓ ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోసమ్మేళనంలో భాగంగా నిర్వహించనున్న ఒంగోలు ఆవులు, గిత్తలు, పుంగనూరు ఆవులు, గిత్తల అందాల పోటీలు, అలాగే ఒంగోలు ఆవుల పాలపోటీల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి పోటీలు రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ వెంకన్నబాబు, పాకలపాటి భద్రరావు, డీజే రాజు, ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్నేహాన్

బుట్టాయగూడెం : సుస్థిర అభివృద్ధి, ఆరోగ్యలక్ష్య సాధన కోసం గ్రామ టాస్క్ ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సచివాలయాల శాఖ, సామాజిక పరివర్తన మార్పు విభాగం కోఆర్డినేటర్ టిఎస్ స్నేహాన్ తెలిపారు. కేఆర్‌పురం పీహెచ్‌సీలో ఇటీవల జారీ అయిన జీఓ నంబర్ 34పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, యుక్త వయస్సు బాలికల ఆరోగ్య పరిస్థితులు మెరుగు పరచడానికి ఈ టాస్క్‌ఫోర్స్ ఉపయోగపడుతుందని అన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లో పని చేసే సామాజిక ఆరోగ్య అధికారి టీమ్‌లీడర్‌గా, ఏఎన్ఎమ్, ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఈ టాస్క్‌ఫోర్స్ టీంలో సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.చందన్ మాధుర్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎం.శాంతకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ బి.చంద్రావతి, సామాజిక ఆరోగ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సాగర్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వెంకటరామానుజపురానికి చెందిన మారెడ్డి వీరవెంకట నాగ సత్యనారాయణ (20) గత నెల 22వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో కలుపు మందు తాగాడు. అతనిని గమనించిన కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయగా, గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆ మేరకు బాబాయ్ వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

జంగారెడ్డిగూడెం రూరల్ : చిన్నవారిగుడెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నవధాన్యాలను సాగు చేద్దాం - పుడమి తల్లిని కాపాడుకుందాం అనే నినాదంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సబ్ డివిజనల్ యాంకర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎల్–2 ఈఏ పాటేశ్వరీ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి ప్రధాన పంటలకు పోషకాలు అందుతాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరీ, లీడ్ ఫార్మర్ కె. నాగలక్ష్మి, సీఏ కె.నాగలక్ష్మి డ్వాక్రా గ్రూపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.